న్యూజెర్సీ కథల పోటీలో 150 రూపాయిలు బహుమతిగా అందుకున్న




ఆవకాయ రోజులొచ్చాయంటే చాలు హడావిడి అంతా ఇంతా కాదు. మంచి మిరపకాయలు ఎంచుకోడం; నమ్మకమైన ఆవాలు పిండి పట్టించుకోడం, మామిడికాయలు కొనేలోగా ఇది కసరెక్కకుండా కాపాడుకోడం అంతా ఓ పెద్ద తతంగం.

అన్నట్టు మామిడికాయలు కొనడం అంటే మాటలా?! కాయ పులుపుండాలి, తగు మాత్రం పీచుండాలి. పలకమారకూడదు. సొన వాసన రాకూడదు. అంత పెద్దవీ కాకూడదు, మరీ చిన్నవీ కాకూడదు.

ఆవకాయకు మామిడి కాయల ఎన్నిక పెద్ద సమస్య. ఇవి సరైనవి దొరికే దాకా మార్కెటు చుట్టూ తిరుగుతూండాలి. పోనీ వెళ్ళినవాళ్ళం ఏదో రకం కాయ కొందామంటే మన సొప్పదు. రేపన్నా ఇంత కన్నా మరింత మంచివి రాకపోతాయా అని ఆశ. అలా తిరిగి తిరిగి విసుగొచ్చి ఓ రోజు ఏవో రకం కాయలు కొని తీసుకొస్తే అంతా తలో మాటా అంటారు. ఒకళ్ళు పులుపు తక్కువంటే, మరొకళ్ళు కొబ్బరి ముక్కల్లా జవజవలాడే ఈ కాయ వూరగాయ ఎన్నాళ్ళు నిలవ వుంటుందని మూతి అష్టవంకర్లు తిప్పుతారు. ఇవన్నీ సహించి ఎలాగోలా ఈ ఏటికి ఐపోయింది అనిపిద్దాం అంటే ఎదురింటి వాళ్ళు "ఆవకాయ కత్తిపీట రిపేరుకు పోయింది లేద"నేస్తారు. మా వాడకట్టు కంతా వాళ్ళ ఇంట్లోనే వుందీ ఆవకాయ కత్తిపీట. మామిడికాయ ముక్క బజార్లో కొట్టించుకోవచ్చుగానీ ఆవకాయ కత్తిపీట మీద వచ్చినంత పొందిగ్గా రావు ముక్కలు.

మనకీ ఓ ఆవకాయ కత్తిపీట ఉండడం ఎందుకైనా మంచిదని కొలుములన్నీ తిరిగినా మా వల్ల కాదంటే మా వల్ల కాదన్నారు. ఓయబ్బా ఈ కత్తిపీట చెయ్యడం బ్రహ్మ విద్యా ఏమన్నానా అంటే, అవును మరి అందరూ చెయ్యలేరీ కత్తిపీటని. ఆ చివర, ఆధారం మధ్యలో బరువూ, ఈ చివర శక్తీ వున్న తులాదండం లాంటిది. ఆధారాన్ని కొయ్యపీటకు బిగించి మంచిగా ముక్కలు కొట్టుకోవచ్చు. కత్తి ఒదుపుగా పదుతుంది బాగా చేసినట్టైతే. లేకుంటే ముక్క సరిగా రాదు. చేతులూ,వేళ్ళూ ఎగిరిపోయే ప్రమాదం కూడా వుంటుంది. లేద ఓపిగ్గా తిరగ్గా తిరగ్గా ఆఖరికి ఒక కొలిమిలో "ఓస్ ఇదనగా ఎంత పని! నేను చేసిస్తా"నన్నాడు. అన్నట్టుగానే పాపం చాలా బాగా చేసిచ్చాడు. పేట పేటంతకీ మంచిపేరు తెచ్చుకుంది మా ఆవకాయ కత్తిపీట. సీజనొచ్చిందంటే మా ఇంట్లో కన్నా అది బైట వుండడమే ఎక్కువైంది. సమయానికి దొరుకుతుందో లేదోనని మామిడికాయలు తెచ్చుకోకుండానే ఓ వారం పది రోజులు ముందుగా అడిగి పట్టుకెళ్ళే వాళ్ళొకళ్ళైతే, పట్టుకెళ్ళినవాళ్ళు పనైపోగానే తిరిగి ఇవ్వకుండా స్నేహితులకీ, బంధువులకీ, అడిగినవాళ్ళకీ, అడగనివాళ్ళకీ అటునుంచటే సప్లై చేసి వాళ్ళ బుద్ధిపుట్టినప్పుడు తిరిగి ఇచ్చేవారు మరి కొందరు. పోనీ ఈ లోగా మనం పోయి అడిగి తెచ్చుకుందామా అంటే వాళ్ళింట్లో వుంటే గదా. ఎవరింట్లో వున్నదీ ఒక్కొక్కప్పుడు వాళ్ళకే తెలీదు. ఇంతకీ ఈ కత్తిపేట చూశాక అంత వరకూ బజార్లో ముక్కలు కొట్టించుకునేవాళ్ళు కూడా మానేసి దీనినే వుపయోగించుకోవడం మొదలు పెట్టారు.

ఇదిలా వుండగా ఒక మారేమైందంటే ఒకావిడ వాళ్ళ వాళ్ళున్నారని మా ఆవకాయ కత్తిపీటని మరో వూరు పంపించేసింది తన పని అవంగానే. ఎన్ని మాట్లు అడిగినా ఇంకా తిరిగి రాలేదనే చెబుతూ వుండేది. ఈ కత్తిపీట ఎప్పుడొస్తుందో నమ్మకంలేక మేము మామిడి కాయలు కూడా కొనుక్కోకుండా మధనపడ్తుంటే-దీని కోసం తిరిగి పోయేవారు మేమేదో దాన్ని దాచేసి అలా వూరెళ్ళిందంటున్నామని అపోహ పడినట్లు నిగూఢంగా చూస్తూ పోయేవారు. పోనీ ఎవరినన్నా ఆ వూరుపంపి తెప్పిద్దామా అంటే ఆ ఛార్జీలకు రెండు కత్తిపీటలొస్తాయి కానీ అంత తొందర్లో అంత బాగా చేసిచ్చేవాడెవడు?

"ఏమండీ ఇలా చేసా రని"అడిగితే "నాకేం తెలుసు! రేపే తెచ్చిస్తామంటే పట్టుకెళ్ళమన్నాను కత్తిపీటను చూసి ఓహ్ ముచ్చటపడి పోతుంటేను. ఇలా చేస్తారని నేను మాత్రం కలగన్నానా?" అంటుంది. అంతేగాని పరాయి వాళ్ళ వనిముట్టు మరోళ్ళకి ధారాదత్తం చేసానే అన్న బాధ ఇసుమంతైనా లేదు ఆమె ముఖంలో. ఆ సీజనుకిక వాళ్ళ అవసరం ముందే తీరిపోయింది కనుక ఆమెకి బాధే లేదు. తెల్లారి లేస్తే ముఖ ముఖాలు చూసుకోవలసిన వాళ్ళం చిన్న వనిముట్టు కోసం తగాదాలు పడ్డం ఏం బాగుంటుంది! సరే ఈమాటుకెలాగోలా సర్దుకుందాంలే అని తిరిగి వస్తుంటే ఎదురైంది మా కత్తిపీట. ప్రాణం లేచొచ్చినంత పనైంది. కత్తిపీట తెచ్చే ఆసామిని అది మాదే ఇవ్వండంటే ఏమంటాడోనని అతని వెనకేనే వెళ్ళి తొందర తొందరగా తలుపు తట్టాను. తలుపు తీసిన ఆ యింటావిడ కత్తిపీటనీ దాన్ని మోసుకొచ్చిన ఆసామిని చూసి బిత్తరపోయింది. ఆఖరికి "ఈ కత్తిపీట మీకెవరిచ్చారు?" అంది ఆయన్ని చూసి.

"మీ ఆయనే ఇచ్చారు మీరింట్లో లేనప్పుడు" అని ఆయన సమాధానం. "హయ్యో రాతా! ఇంకా ఇది మా వాళ్ళ వూళ్ళోనే వుందనుకుంటున్నానే. పాపం వీళ్ళని తెగ తిప్పుకున్నాను ఇంటి చుట్టూతా" అని కొంచెం పశ్చాత్తాపం ప్రదర్శించింది ముఖంలో. ఇంతలో లోపల్నుంచి వాళ్ళాయన వచ్చి సంగతి తెలుసుకుని "మీ వాళ్ళు ఈ కత్తిపీటని మర్నాడే తెచ్చి యిచ్చారు. నువ్వు లేనప్పుడు వాళ్ళొచ్చి అడిగితే నేనే ఇచ్చాను. ఆ మాటే మర్చి పోయాను సుమా" అని తెగ ఆశ్చర్యపోవటం మొదలెట్టాడు. 'మరి వాళ్ళు తెచ్చి ఇచ్చిన మర్నాడే పట్టుకెళ్ళిన వాళ్ళు ఇన్నాళ్ళ దాకా తిరిగి తెచ్చి ఇచ్చారు కాదేం' అని అడక్కుండానే కత్తిపీట తెచ్చి నాయన "మా యింట్లో కాయలు కొట్టడం చూసి ఒకళ్ళూ వాళ్ళింట్లోంచి మరొకళ్ళు ఇలా మా వద్దకి వచ్చినప్పట్నించీ తిరుగుతూనే వుందండీ... ఇక బావుండదని ఇవాళ తీసుకు వచ్చాను" అన్నాడు లోకాలనుద్ధరించే వాడిలా పోజు పెట్టి. కత్తిపీట మాదని తెలుసుకున్నాడు కనుక నా చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.

అమ్మయ్య సమయానికి ఆదుకున్నావు కదా అని కత్తిపీటని పొదివి పట్టుకుని ఆనంద బాష్పాలు రాల్చుకుంటూ ఇల్లు చేర్చాను. కత్తిపీటను చూసి ఇల్లు ఇల్లంతా తెగ సంబరపడిపోయారు ఆవకాయ కంచంలో పడిపోయినంత ఆనందంతో.